సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



కొండెక్కి సంచోరీస్తూ..


భక్తుల మునుగులో దొంగలు రెచ్చిపోతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. - 8లో



కవలలపై విధి కన్నెర్ర

కాట్రేనికోన మండలం దొంతికుర్రుకు చెందిన కవలలు రామ్, లక్ష్మణ్ (32)లు పొట్టకూటి కోసం హైదరాబాద్ వలస వెళ్లి అక్కడ మృత్యువాత పడ్డారు. - 8లో

55 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 55,862 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 6,100 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

వాల్మీకి రామాయణం విశిష్టమైంది



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: రామాయణం ద్వారా రాముడి సుగుణాలు, సీతమ్మ గొప్పదనాన్ని మానవాళికి వాల్మీకి మహర్షి చాటిచెప్పారని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. గురువారం వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా అమలాపురం కలెక్టరేట్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటికీ వాల్మీకి రామాయణం ఎంతో విశిష్టమైందన్నారు. కవిగా వాల్మీకి భారతీయ సాహిత్యానికి దారి చూపారన్నారు. డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ టీవీ ప్రసాద్ మాట్లాడుతూ రామాయణం కుటుంబ వ్యవస్థను చాటి చెబుతుందన్నారు. తాళ్లరేవు చెందిన శీలం శ్రీను వాల్మీకి వేషధారణలో ఆకట్టుకున్నాడు. కలెక్టరేట్ ఏఓ కె.కాశీవిశ్వేశ్వరరావు, వికాస సంస్థ జిల్లా మేనేజర్ జి.రమేష్, సహాయ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ దొర, వసతి గృహ సంక్షేమ అధికారులు సీహెచ్ రాధాకృష్ణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన్ ప్రకాష్ శిక్షణ తరగతులు నిలిపివేయాలి

అమలాపురం టౌన్: పాఠశాల విద్యాపరంగా ఉపాధ్యాయుల కొరత వేధిస్తున్న క్రమంలో ఆరు నెలల పాటు ఎస్‌ఎస్‌ఏ నిర్వహించనున్న జ్ఞాన్ ప్రకాష్ శిక్షణ తరగతులను నిలిపివేయాలని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, ఆ శాఖ రాష్ట్ర అధికారులకు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) తరఫున ఆయన లేఖలు రాశారు. ఆ ప్రతులను అమలాపురంలో గురువారం స్థానిక మీడియాకు విడుదల చేశారు.

ఎస్‌ఎస్‌ఏ ఈ నెల 21వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 1వ తేదీ వరకూ ఈ శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోందని ఎమ్మెల్సీ గుర్తు చేశారు. ఉపాధ్యాయుల కొరత దృష్ట్యా ఆ శిక్షణ తరగతులను ఈ విద్యా సంవత్సరం నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు విద్యేతర పనులు అప్పగించడం వల్ల తరగతి గదుల్లో విద్యా బోధన సక్రమంగా సాగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి శిక్షణ తరగతులు నిర్వహించే ముందు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి నిర్ణయాలు తీసుకునే పద్ధతిని ప్రభుత్వం, శాఖ ఉన్నతాధికారులు పాటించడం లేదని ఎమ్మెల్సీ ఆరోపించారు.



అమలాపురం సమీపం బండారులంకలో కురుస్తున్న వర్షం



ఉప్పలగుప్తం మండలంలో రోడ్డుపై గుంతల్లో చేరిన వర్షం నీరు



ఓఎన్జీసీ టెర్మినల్ వెనుక భాగంలో కెరటాల తాకిడికి కుంగిపోయిన రోడ్డు

వానసడి.. అలజడి

- ఖరీఫ్ పంటకు ముప్పు
- మూడు రోజులుగా భారీ వర్షాలు
- ఓడలరేవులో అలల విధ్వంసం
- కోతకు గురవుతున్న ఓఎన్జీసీ టెర్మినల్ వెనుక భాగం

సాక్షి, అమలాపురం/ అల్లవరం: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావం జిల్లాపై పడింది. ఒకవైపు అడపా దడపా కురుస్తున్న భారీ వర్షాలు.. మరోవైపు తీరంలో విరుచుకుపడుతున్న అలలు.. ఇటు ఖరీఫ్ రైతులు, అటు తీరంలోని మత్స్యకారులను ఆందోళనకు గురిచేస్తున్నారు. ఖరీఫ్ రైతులను సాగు ఆరంభం నుంచి ముగింపు వరకూ వర్షాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆకుముడుల సమయంలో.. వరి చేలు దుబ్బులు చేస్తున్నప్పుడు.. తాజాగా పాలుపోసుకుని గింజ గట్టిపడుతున్న దశలోనూ వర్షాలు చావు దెబ్బతీశాయి. నైరుతిలో అంచనాలకు మించి కురిసిన వర్షాలతో ఈ ఏడాది దిగుబడి పడిపోతోందని రైతులు వాపోతున్నారు. తాజాగా వరుసగా మూడు రోజుల నుంచి కురుస్తున్న వానలు ఖరీఫ్ వరి రైతులకు ఇబ్బందిగా మారింది. ముంపు పెద్దగా లేకున్నా, అధిక వర్షాలతో దిగుబడి తగ్గుతోందని రైతులు వాపోతున్నారు. జూలై నెలలో వర్షాలు వరి చేలు ఆకుమడుల దశలోనే దెబ్బతిన్నాయి. సెప్టెంబర్ మొదటి వారం, తాజాగా కురుస్తున్న వర్షాలకు ఈనిక దశలో ఉన్న చేలు దెబ్బతింటున్నాయి. దిగుబడి తాలు, తప్పలు అధికంగా వస్తాయని రైతులు వాపోతున్నారు. ముమ్మిడివరం, అమలాపురం, పి.గన్నవరం, రాజోలులోని తీర ప్రాంతాల్లో ఖరీఫ్ దిగుబడి చాలాచోట్ల 20 బస్తాలు (బస్తా 75 కిలోలు) మించి రాదని వాపోతున్నారు. వర్షాలతో మురుగు నీటి కాలువలు పొంగి పొర్లుతుండగా, రోడ్లపై నీరు చేరి వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు.



టెర్మినల్ గేటు వరకూ వచ్చిన సముద్ర కెరటాలు, రోడ్డుపై చెత్తాచెదారం

తీరం పొడవునా కోత

అల్పపీడనం ప్రభావంతో ఓడలరేవు తీరంలో సముద్రం విధ్వంసం సృష్టించింది. బుధవారం ఉదయం నుంచి ప్రారంభమైన అలల ఉధృతికి ఓడలరేవు తీరం పొడవునా కోతకు గురవుతోంది. తీరంలో సముద్రం ఒడ్డున చమురు కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓఎన్జీసీ ప్లాంట్‌కు రాకాసి అలల తాకాయి. పెద్ద ఎత్తున ఎగసిపడిన కెరటాలు ప్లాంట్‌కు రక్షణగా ఉన్న ప్రహరీని బలంగా తాకడంతో రోడ్డుపై ఇసుక చేరింది. రాకాసి అలల ఉధృతికి టెర్మినల్ గేటు నుంచి సముద్ర జలాలు ప్లాంట్‌లోకి చేరాయి. 2018 ఆగస్టులో ఇదే మాదిరి భారీ అలలకు తీరం పొడవునా వేలాది ఎకరాల సరుగుడు తోటలు కోతకు గురికాగా, రోడ్లను సైతం తనలో కలిపేసుకుంది. మళ్లీ ఆరేళ్ల తర్వాత భారీ అలలతో విధ్వంసం సృష్టించి తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. టెర్మినల్ పొడవునా, వెనుక వైపున ఉన్న ఆక్వా చెరువులను భారీ అలలు ముంచెత్తాయి. రూ.లక్షలు వెచ్చించి ఆక్వా సాగు చేస్తే కెరటాల తాకిడితో రొయ్యల చెరువుల నిండా ఇసుక మేట వేసి తీవ్ర నష్టాన్ని కలిగించాయి. ఆక్వా చెరువులను ముంచెత్తిన కెరటాలు టెర్మినల్‌కు పొడవునా నిర్మించిన బీటీ **రోడ్డును ధ్వంసం చేసింది. రెండు చోట్ల రోడ్డు కుంగిపోయి, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించింది. ఓడలరేవు గ్రామంలో మురుగునీరు దిగువనకు వెళ్లేందుకు నిర్మించిన డ్రైనేజీ ఇసుకతో నిండిపోయింది. భారీ కెరటాల విధ్వంసానికి టెర్మినల్‌లోకి వాహనాలు వెళ్లే అవకాశం లేకుండా చేసింది. చెత్తాచెదారం తొలగింపునకు చర్యలు చేపట్టారు. సునామీ తర్వాత ఓడలరేవు తీరాన్ని పరిశీలిస్తే సుమారు వంద** మీటర్లకు పైగా తీరం కోతకు గురై ముందుకు వచ్చింది. ఓడలరేవుతోపాటు కొమరగిరిపట్నం, చిర్రయానాం, ఎస్.యానాం, అంతర్వేది వంటి ప్రాంతాల్లో సముద్ర అలలు ఎగిసిపడడంతో స్థానికులు, మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లాలో వర్షపాతం ఇలా..

జిల్లాలో బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి గురువారం ఉదయం ఎనిమిది గంటల వరకూ 24.7 మిల్లీమీటర్ల సగటు వర్షంపాతం నమోదైంది. అత్యధికంగా మలికిపురం మండలంలో 57.6 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా కపిలేశ్వరపురం 6.8 మిల్లీమీటర్ల వర్షం పడింది. సఖినేటిపల్లి 56, ఐ.పోలవరం 39.2, అమలాపురం 38.4, రాజోలు 34.6, ఉప్పలగుప్తం 34.4, కాట్రేనికోన 30.2, అంబాజీపేట 25.2, అల్లవరం 22.6, ముమ్మిడివరం 20.6, మామిడికుదురు 19, పి.గన్నవరం 22.4, కె.గంగవరం 18.2, అయినవిల్లి 19.6, రాయవరం 18.2, రామచంద్రపురం 17, మండపేట 18, కొత్తపేట 16.2, ఆలమూరు 13, రావులపాలెం 7.8, ఆత్రేయపురం 7.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

బాధితులకు రూ. లక్ష సాయం



విస్ఫోట బాధిత కుటుంబాలకు సాయాన్ని అందజేస్తున్న శెట్టిబలిజ సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురం రావులచెరువు ప్రాంతంలో ఇటీవల జరిగిన బాణసంచా విస్ఫోటంలో బాధిత కుటుంబాలకు హైదరాబాద్‌కు చెందిన స్మైల్ ఫౌండేషన్ సంస్థ రూ.50 వేల సాయం అందించింది. ముమ్మిడివరం శెట్టిబలిజ సంఘం శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ రూ.50 వేలు సమకూర్చింది. బాధిత కుటుంబాలకు మొత్తం రూ.లక్ష నగదును నాయకులు గురువారం అందజేశారు. ఇందులో స్మైల్ ఫౌండేషన్ సభ్యులు విస్ఫోట ఘటనలో గాయపడిన గొవ్వాల రాజుకు రూ.30 వేలు, ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన సుభద్రమ్మకు రూ.20 వేలు అందజేశారు. ముమ్మిడివరం శెట్టిబలిజ సంఘం వారు ఆ రెండు బాధిత కుటుంబాలకు చెరో రూ.25 వేల చొప్పున సాయం సమకూర్చారు. శెట్టిబలిజ సంఘాల నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, విత్తనాల శేఖర్, నంసాని బులినాని, గొవ్వాల రాజేష్, దొంగ చిన్నా, దొమ్మేటి రాము తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలతో ప్రజలు సతమతం

అమలాపురం టౌన్: ఇటీవల వచ్చిన వరదలు, ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు ప్రజలు చికెన్ గున్యా, డెంగీతో పాటు పలు వైరల్ జ్వరాలతో బాధ పడుతున్నారని అమలాపురానికి చెందిన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణ మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన జిల్లా పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తక్షణమే జ్వరాలపై ఇంటింటా సర్వే చేయించి రోగులను గుర్తించి ప్రభుత్వ వైద్యాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం సక్రమంగా అందక, ప్రైవేట్ ఆస్పత్రుల్లో బిల్లుల భారం భరించలేక సామాన్యులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో వైద్య సిబ్బంది ఇంటింటా సర్వేలు తరచూ చేసి ప్రజారోగ్యం కాపాడిందని గుర్తు చేశారు. పార్టీ జిల్లా నాయకులు పాలమూరి రామకృష్ణ, కుడుపూడి గోపాలకృష్ణ, పితాని బేబీరావు, కొనుకు వెంకటేశ్వరరావు, కముజు సుందరరావు, కేతా సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో 'కూటమి' చేసిందేమీ లేదు

మాజీ మంత్రి గొల్లపల్లి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: వంద రోజుల కూటమి ప్రభుత్వంలో ప్రజలకు చేసిందేమీ లేదని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యువజన విభాగ సమావేశం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సూరిశెట్టి బాబీ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి గొల్లపల్లి మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసే వరకూ అంతా కలసి సాగుదామని పిలుపునిచ్చారు. ఇసుక ఉచితం అంటూ నమ్మించి గెలిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను నిలువునా ముంచారన్నారు. దొడ్డిదారిన ఇసుకను కూటమి శ్రేణులు దోచుకెళ్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. ఉల్లి ధర కన్నీళ్లు రప్పిస్తుందని, ఇలా అన్ని కూరగాయల ధరల బాదుడు దారుణంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ పేరిట హామీ ఇచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక వాటిని మరిచిపోయారన్నారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సూరిశెట్టి బాబీ, రాష్ట్ర బీసీ విభాగం నాయకులు పాటి శివకుమార్, సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు, జిల్లా విద్యార్థి విభాగం వైస్ ప్రెసిడెంట్ తాడి సహదేవ్, సఖినేటిపల్లి మండల అధ్యక్షులు కుసుమ చంద్రశేఖర్, చెల్లింగి నవీన్, జిల్లెల్ల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి



విద్యా వైభవ్ ఒలింపియాడ్ జిల్లా పోటీల్లో విజేతలతో డీఈఓ కమలకుమారి తదితరులు

అమలాపురం టౌన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి, వారిలో పోటీతత్వాన్ని పెంచాలని డీఈఓ ఎం.కమలకుమారి సూచించారు. ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ)కు జిల్లాలో ఎంపికైన పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి విద్యా వైభవ్ ఒలింపియాడ్ పోటీలు స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. జిల్లాలో పీఎంశ్రీకు ఎంపికైన 26 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యా వైభవ్ ఒలింపియాడ్, మంథన్ మండల్, డిజిటల్ క్విస్ట్, డిస్కవరీ లెర్నింగ్ అండ్ లోకల్ సైట్స్ అంశాల్లో పోటీలు జరిగాయి. విద్యా వైభవ్ క్విజ్ పోటీల్లో పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.సింధు, ఎల్.అజేయుడు (ప్రథమ), మండపేట శ్రీగౌతమి మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.దీక్షిత, ఎస్.గీతాశ్రీ (ద్వితీయ), హసన్‌బాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీహెచ్ఎన్వీ మహేశ్వరి, సీహెచ్ తనూశ్రీ (తృతీయ) విజేతలుగా నిలిచారు. మంథన్ మండల్ డిబేట్ పోటీల్లో కె.గంగవరం మండలం దంగేరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి డీఎంఎల్ఎస్ఎస్ విద్య, అయినవిల్లి మండలం సిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.సాయి అశ్రిత, రామచంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.హర్షిణి దుర్గ, డిస్కవరీ అండ్ లోకల్ సైట్స్ ఫొటో ఎగ్జిబిషన్‌లో రాజోలు మండలం కడలి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని వి.లక్ష్మీజ్యోతి, అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.దత్త గోవింద్, మలికిపురం మండలం బట్టేలంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్ వైష్ణవి, డిజిటల్ క్విస్ట్ పోటీల్లో ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.శేషపద్మ వైష్ణవి, ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎన్‌కేఎస్ఎస్ మీనన్, మండపేట ఎన్‌జీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వై.ప్రణీతలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుచుకున్నారు. జిల్లా విజేతలను త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని డీఈఓ తెలిపారు. పోటీలకు అమలాపురం మహాత్మ గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.కామేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. పాఠశాల హెచ్‌ఎం వి.విజయకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు, సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ప్రోగ్రామ్ నోడల్ అధికారి పి.రాంబాబు, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిమ్మకాయల గణేశ్వరరావు, విత్తనాల శ్రీనివాస్ తదితరులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

నిర్లక్ష్యంతో ఢాం.. ఢాం

- అనధికార బాణసంచా తయారీపై నిఘా లోపం
- వాటిని అదుపు చేస్తేనే ఆనంద దీపావళి
- అమలాపురం విస్ఫోట ఘటనతో ఉలికిపాటు



అమలాపురంలో ఇటీవల మందుగుండు విస్ఫోటానికి తునాతునకలైన ఇల్లు (ఫైల్)

అమలాపురం టౌన్: దీపావళి.. వెలుగుల పండగ. చిన్నా, పెద్దలకు ఆనందమే నిండుగ.. అలాంటి పండగకు వినియోగించే సామగ్రి తయారీలో లోపాలు విస్ఫోటానికి దారితీస్తున్నాయి. అనధికార బాణసంచా తయారీ కేంద్రాల్లో విస్ఫోట ఘటనలు, ప్రాణ, ఆస్తి నష్టాలతో విషాదం ఆవరిస్తోంది. పటిష్ఠ నిఘాతో అనధికార తయారీ కేంద్రాలను పూర్తిగా అదుపు చేస్తే జిల్లాలో ఆనంద దీపావళి జరుపుకోవచ్చు. ఈ నెల 31న దీపావళి పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకొనేందుకు జిల్లా ప్రజలు సిద్ధమవుతున్నా, ఇటీవల అమలాపురం రావులచెరువు ప్రాంతంలో గృహాల మధ్య ఓ అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన విస్ఫోట ఘటన ఉలిక్కి పడేలా చేస్తోంది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందడమే కాకుండా, ఏడుగురు తీవ్రంగా గాయపడి ఇంకా చికిత్స పొందుతున్న చేదు అనుభవాలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు 15 లోపే ఉంటే.. అనధికార కేంద్రాలు అంతకు మించే ఉన్నాయి. జిల్లాలోని 385 గ్రామాలు, 3 పట్టణాలు, ఒక నగర పంచాయతీలో 17 లక్షలకు పైగా ఉన్న ప్రజలకు ఈ దీపావళి ఆనంద కేళి అవుతుంది. అయితే మానవ తప్పిదాలు, నిఘా లోపాలతో ఏటా జరిగే దీపావళి పండగకు ముందు ఏదోమూల అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో సంభవిస్తున్న విస్ఫోట ఘటనలతో ప్రాణ, ఆస్తి నష్టాలు అనివార్యమవుతున్నాయి.

మరింత నిఘా ఉంచేందుకు..

బాణసంచా తయారీ కేంద్రాలకు అధికారికంగా అనుమతులను అగ్నిమాపక శాఖ ఇస్తుంది. దీపావళికి బాణాసంచా దుకాణాలకు లైసెన్స్‌లు, పర్యవేక్షణను పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖలు సంయుక్తంగా పర్యవేక్షిస్తాయి. జిల్లాలో గత సంవత్సరం దీపావళికి 424 దుకాణాలకు లైసెన్స్‌లు ఇచ్చారు. ఈ ఏడాది పండుగకు కూడా దాదాపు ఇదే స్థాయిలో లైసెన్స్‌లు ఇవ్వనున్నారు. అయితే బాణాసంచా, మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలకు పర్మినెంట్ లైసెన్స్‌లు జారీచేస్తే అది అధికార తయారీ కేంద్రం అవుతుంది. అధికార కేంద్రం ఏర్పాటుకు సవాలక్ష నిబంధనలు ఉంటాయి. జనావాసాలకు దూరంగా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. తయారీ కేంద్రం వద్ద ప్రమాదం అనివార్యమైతే తక్షణమే అదుపు చేసేందుకు ఇసుక, నీటి నిల్వలు తగిన పరిమాణంలో విధిగా ఉండాలి. లైసెన్స్‌ను రెన్యూవల్ చేయించుకుంటూ ఉండాలి. వీటితో పాటు పలు నిబంధనలు విధిగా అమలు చేయాలి. ఇలాంటి అనుమతులు, జాగ్రత్తలు లేకుండా కొందరు నివాస గృహాల మధ్యే అనధికారికంగా బాణసంచా తయారీని చేపడుతున్నారు. ఇటీవల అమలాపురంలో జరిగిన విస్ఫోట ఘటనకు ఇంట్లో అనధికారికంగా బాణసంచా తయారీ చేస్తున్నట్లు విజయవాడ ఫోరెన్సిక్ అధికారులు గుర్తించారు. ఇళ్లలోనే అనధికారికంగా బాణసంచా తయారీ చేసే వారిపై నిరంతర నిఘా ఉన్నప్పుడే ఇలాంటి దుర్ఘటనలను అరికట్టవచ్చు.

లోపం ఇక్కడి నుంచే...

మందుగుండు సామగ్రి అనధికార తయారీపై నిఘా ఉండడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేక అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గతంలో పలు బాణసంచా కేంద్రాల్లో పెను ప్రమాదాలు, ప్రాణ, ఆస్తి నష్టాల గురించి తలుచుకుని నిఘా లోపాలపై ఇప్పుడు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇందులో అధికారుల నిఘా లోపం ఓ కారణమైతే, తయారీదారుల మానవ తప్పిదం మరో కారణం.

ఇవీ చేదు అనుభవాలు

- మండపేటలో నాలుగేళ్ల కిందట ఓ బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన విస్ఫోటంలో తల్లి, కుమారుడు, ఓ సహాయకుడు మొత్తం ముగ్గురు మృత్యువాత పడ్డారు.
- కొత్తపేటలో తొమ్మిదేళ్ల కిందట బాణసంచా కేంద్రంలో జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందారు.
- మండపేటలో దాదాపు 15 ఏళ్ల కిందట ఓ బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన భారీ విస్ఫోటంలో పది మంది వరకూ మృత్యువాత పడ్డారు.
- రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరంలో రెండేళ్ల కిందట బాణసంచా కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మరణించారు.

కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించండి

కంబాలచెరువు: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని జిల్లా కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు యు.లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యల్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లేందుకు పలు రకాల ప్రదర్శనలు చేపట్టామన్నారు. 24 ఏళ్లుగా పనిచేస్తున్న తమ సర్వీసులను రెగ్యులర్ చేసేందుకు ఉద్దేశించిన యాక్టు-30, జీవో నెంబర్ 114లను తక్షణమే అమలు చేయాలని పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాధర్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ దాదాపు పూర్తవుతుండగా ఎన్నికల కోడ్ వల్ల ఆగిన ఫైల్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

వ్యాన్ అదుపుతప్పి డ్రైవర్ మృతి



అదుపుతప్పి మురుగు కాలువలోకి దూసుకుపోయిన వ్యాన్

ముమ్మిడివరం: వ్యాన్ అదుపుతప్పి మురుగు కాలువలోకి దూసుకు వెళ్లిన సంఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ముమ్మిడివరం మండలం అనాతవరం శివారు వడ్డివారిపేటకు చెందిన బీర శ్రీనివాసరావు (39) గురువారం కొబ్బరి కాయల లోడును దింపి తిరిగి వస్తుండగా, అనాతవరం– భీమనపల్లి రోడ్డులో దంగేటివారిపాలెం సమీపంలో వ్యాన్ అదుపు తప్పింది. వెంటనే మురుగు కాలువలోకి దూసుకుపోయింది. దీంతో శ్రీనివాసరావు వ్యాన్‌లో ఇరుక్కుపోయి మృతి చెందాడు. శ్రీనివాసరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చి కుక్క స్వైరవిహారం

20 మందికి గాయాలు



ఓ మహిళ కాలిపై గాయం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో ఓ పిచ్చికుక్క గురువారం సాయంత్రం స్వైర విహారం చేసింది. 20 మందిని గాయపరిచింది. బాధితులంతా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. కొందరు ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరి వైద్యం పొందుతున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, దుడ్డివారి అగ్రహారం, విత్తనాల వారి కాల్వగట్టు తదితర ప్రాంతాల్లో పిచ్చికుక్క చెలరేగిపోయింది. దారిలో కనిపించిన వారిని బలంగా కరిసింది. బాధితుల్లో ఓ మహిళతోపాటు జట్టు కార్మికులు ఉన్నారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు బాధితులకు చికిత్స చేసి మందులు ఇచ్చారు.

వసతి గది ఆధునీకరణకు రూ.3 లక్షల విరాళం



దాత కుటుంబీకులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈఓ

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయానికి వచ్చే యాత్రికుల సౌకర్యార్థం నిర్మించిన వినాయక సదన్‌లో వసతి గది ఆధునీకరణకు అయినవిల్లి వాసి స్వర్గీయ నల్లం బాల కృష్ణారావు పేరున వారి కుటుంబ సభ్యులు గురువారం రూ.3 లక్షల విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజుకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులను సత్కరించి స్వామి శేష వస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

కొండెక్కి సంచోరీస్తూ..

- భక్తుల్లా వచ్చి దొంగతనాలు
- రత్నగిరిపై రెచ్చిపోతున్న దొంగలు
- విశ్రాంతి మండపాలు, క్యూలో చేతివాటం

అన్నవరం: దొంగలు కొండెక్కారు.. అందినకాడకు దోచుకుంటున్నారు.. భక్తుల ముసుగులో రెచ్చిపోతున్నారు.. ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. నిత్యం వీరి బారినపడి అనేక మంది భక్తులు మోసపోతున్నారు. గతంలో దేవస్థానంలోని 30 వీఐపీ సత్రంలో పోలీసు ఔట్ పోస్ట్ ఉండేది. అక్కడొక హెడ్‌కానిస్టేబుల్, మరో ఇద్దరు పోలీసులు విధులు నిర్వహించేవారు. గతేడాది ఆ సత్రాన్ని కూల్చేశారు. తరువాత ఔట్ పోస్టును ఆలయానికి దూరంగా సీతారామ సత్రానికి మార్చారు. అక్కడ పోలీసులు ఉంటున్నారో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో దొంగల పని సులువైంది. భక్తుల్లా నటిస్తూ చోరీలకు పాల్పడుతున్నారు.

అందరికీ కనిపించేలా ఔట్‌పోస్ట్



రత్నగిరిపై పోలీస్ ఔట్‌పోస్ట్ సీతారామ సత్రంలోని ఒక గదిలో ఉంది. ఇది చాలా మందికి తెలియదు. ఈ ఔట్ పోస్ట్‌ను అందరికీ కనిపించేలా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు గది కేటాయించాలని దేవస్థానం అధికారులను కోరతాం. అదే విధంగా దేవస్థానంలో విస్తృతంగా తనిఖీలు చేస్తాం

– శ్రీహరిబాబు, ఎస్సై, అన్నవరం

బ్యాగ్‌లు, పర్స్‌లు కొట్టేస్తూ..

రత్నగిరిపై కొలువైన సత్యదేవుని ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. భక్తుల ముసుగులో కొంతమంది దొంగలు దేవస్థానంలో పలుచోట్ల చోరీలు చేస్తున్నారు. దొంగల బారిన పడిన భక్తులు దేవస్థానం అధికారులకు విషయం చెబితే, మైక్ ద్వారా వస్తువులు లేదా పర్స్ పోగొట్టుకున్నారని చెప్పి.. దొరికిన వాళ్లు తేవాలని ప్రకటిస్తున్నారు. ఇలా ఎవరూ తెచ్చి ఇచ్చిన దాఖలాలు లేవు. బ్యాగ్‌లు లేదా, పర్స్‌లు పోగొట్టుకున్న వారు రోజూ కనీసం ఇద్దరు, ముగ్గురు భక్తులు అధికారుల దృష్టికి తీసుకు వస్తున్నారు. కొంతమంది ఎటువంటి ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోతున్నారు.

రోజుల తరబడి ఇక్కడే..

ఎక్కడెక్కడి నుంచో భక్తుల మాదిరిగా రత్నగిరికి వస్తున్న దొంగలు రోజుల తరబడి కొండపైనే ఉంటున్నారు. భక్తుల కోసం రోజూ ఉదయం పంపిణీ చేసే పులిహోర, దద్దోజనం, మధ్యాహ్నం అన్నదానంలో భోజనం చేస్తారు. తరువాత విశ్రాంతి మండపాల్లో భక్తుల పక్కనే నిద్రిస్తున్నట్లు నటిస్తారు. భక్తులు నిద్రపోయే సమయంలో వారి బ్యాగ్‌లు తస్కరించి మాయమవుతుంటారు. అదే విధంగా కామన్ బాత్ రూమ్‌ల వద్ద స్నానాలు చేసేటప్పుడు బ్యాగ్‌లు పట్టుకుపోతున్నారనే ఫిర్యాదులు కోకొల్లలు.

తనిఖీలు నామమాత్రం

గతంలో రత్నగిరిపై అనుమానాస్పదంగా కనిపించే వారిని పోలీసులు, దేవస్థానం సిబ్బంది తనిఖీ చేసేవారు. ఇక్కడ ప్రస్తుతం అటువంటి తనిఖీలు లేవు. దేవస్థానంలో 36 మంది హోమ్ గార్డులు, వందకు పైగా ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది, సెక్యూరిటీ ఆఫీసర్ ఉన్నారు. కానీ అనుమానాస్పదంగా సంచరించే వారిని, రోజుల తరబడి ఉంటున్న వారిని ఎవరూ ప్రశ్నించడం లేదు. గతంలో రెండు, మూడు రోజులు దాటి కొండపై కనిపిస్తే వారి అడ్రస్, ఏం పని మీద ఉంటున్నారని అడిగేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. దీని వల్ల దొంగల సంచారానికి అడ్డు లేకుండా పోయింది.

విస్తృత తనిఖీలు అవసరం

రత్నగిరిపై రామాలయం పక్కన విశ్రాంతి మండపంలో లేదా, అనౌన్స్‌మెంట్ చేసే రామారాయ కళామందిరం వద్దో పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేయాలి.

అందులో 24 గంటలూ పోలీసులు విధుల్లో ఉండాలి. అదే విధంగా అనుమానాస్పదంగా కనిపించిన వారిని, రోజుల తరబడి రత్నగిరిపై ఉంటున్న వారిని పంపించేయాలి. అదేవిధంగా పలుచోట్ల సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి. కనీసం వారానికొకసారైనా స్థానిక ఎస్‌ఐ దేవస్థానంలో తనిఖీలు చేయాలి.



రత్నగిరిపై విశ్రాంతి మండపం వద్ద భక్తుల రద్దీ

స్కేటింగ్ పోటీలకు సర్వ సన్నద్ధం

- నేటి నుంచి ప్రారంభం
- 13 జిల్లాల నుంచి 400 మంది రాక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 68వ అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్–24 పోటీలు ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి 20 వరకూ ఈ పోటీలు జరగనున్నాయి. వీటి నిర్వహణ నిమిత్తం కాకినాడలోని వైఎస్సార్ మున్సిపల్ స్కేటింగ్ రింక్‌ను నిర్వాహకులు సిద్ధం చేశారు. అండర్–11, 14, 17, 19 బాల బాలికల విభాగంలో నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. పోటీల నిర్వహణ నిమిత్తం జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో 50 మంది వ్యాయామ ఉపాధ్యాయులను వినియోగిస్తున్నారు. 20 మంది స్కేటింగ్ సాంకేతిక అధికారులను నిర్వాహకులు నియమించారు. బాలురకు కాకినాడ గాంధీనగర్ మున్సిపల్ స్కూల్‌లో, బాలికలకు సాలిపేట మున్సిపల్ స్కూల్‌లో వసతి ఏర్పాటు చేశారు. పోటీల నిర్వహణ నిమిత్తం జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అధ్యక్షుడు, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్, ప్రధాన కార్యదర్శి ఎల్.జార్జి వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల ఆధ్వర్యంలో తాగునీరు, భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ సగిలి షణ్మోహన్ ఆధ్వర్యంలో అతిథులు పోటీలను ప్రారంభించనున్నారు. ఈ ఏర్పాట్లను సమాఖ్య కార్యదర్శి జార్జి, సంయుక్త కార్యదర్శులు సునీల్, పరశురామ్ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే తిరుపతి, నెల్లూరు, అనంతపురం జిల్లా నుంచి క్రీడాకారులు హాజరై సాధన చేస్తున్నారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జార్జి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లా ఉన్నతాధికారుల సహకారంతో వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులకు ఏ ఇబ్బందీ కలగకుండా పోటీలు విజయవంతంగా నిర్వహిస్తామన్నారు.



స్కేటింగ్‌లో సాధన చేస్తున్న వివిధ జిల్లాల క్రీడాకారులు



పోటీలకు సిద్ధమైన కాకినాడ మున్సిపల్ స్కేటింగ్ రింక్

కవలలపై విధి కన్నెర్ర

- హైదరాబాద్‌లో ఆ ఇద్దరూ మృతి
- దొంతికుర్రు గ్రామంలో విషాదం



రామ్ (ఫైల్)



లక్ష్మణ్ (ఫైల్)

కాట్రేనికోన: కలిసే పుట్టారు.. చివరికి కలిసే ప్రాణాలు విడిచారు.. కాట్రేనికోన మండలం దొంతికుర్రుకు చెందిన కవలలు రామ్, లక్ష్మణ్ (32)లు పొట్టకూటి కోసం హైదరాబాద్ వలస వెళ్లి అక్కడ మృత్యువాత పడ్డారు. వారిద్దరూ ఒకేసారి మృత్యు ఒడికి వెళ్లిన హృదయ విదారక సంఘటన బుధవారం హైదరాబాద్ జీడిమెట్లలో జరిగింది. దొంతికుర్రుకు చెందిన వి.సత్యనారాయణ, సీతమ్మలకు నలుగురు సంతానం. ఇందులో రామ్, లక్ష్మణలు చిన్నవారు. పెద్దన్నయ్య సురేష్‌తో కలసి ఉపాధి నిమిత్తం పదేళ్ల కిందట హైదరాబాద్‌కు వలస వెళ్లారు. తల్లి చనిపోగా రెండో అన్నయ్య శ్రీనివాస్, తండ్రి స్యనారాయణతో కలసి దొంతికుర్రులో ఉంటున్నారు. రామ్, లక్ష్మణలు మృతి చెందారనే విషయం తెలియడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు.

కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. హైదరాబాద్ గుండ్ల పోచంపల్లిలో ఉంటూ కూలీ పనులు చేస్తూ రామ్, లక్ష్మణ్‌లు ఉపాధి పొందుతున్నారు. బుధవారం జీడిమెట్లలో మూతపడిన సాబూరి ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాబ్రికేషన్ పనులకు వెళ్లారు. ఒక షెడ్డుకు ఉన్న పైపులను తొలగిస్తుండగా రామ్ అదుపుతప్పి కింద ఉన్న రసాయనాల ట్యాంకులో పడిపోయాడు. రామ్ ట్యాంక్‌లో రసాయనాలు మింగి ఉక్కిరిబిక్కిరి అవుతుండగా, కాపాడేందుకు లక్ష్మణ సంపులోనికి దిగాడు. స్పృహ కోల్పోయిన రామ్‌ను బయటకు తీసిన లక్ష్మణ్ సైతం నోటి నుంచి నురగలు కక్కుతూ అక్కడే పడిపోయాడు. వీరిద్దరినీ కాపాడే ప్రయత్నంలో మరో కార్మికుడు వెంకటరెడ్డి రసాయనాల గాఢత బారిన పడ్డారు. ముగ్గురినీ షాపూరునగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా రామ్, లక్ష్మణ్‌లు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రామ్, లక్ష్మణ్‌లు మృతి చెందిన ట్యాంకులో నిల్వ చేసిన రసాయనం ఏంటో నిర్ధారణ కావాల్సి ఉంది. ఈ ఘటనకు బాధ్యులపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రాణం తీసిన ఇన్‌స్టాగ్రామ్ పరిచయం..

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధానికి చెందిన ఒక గృహిణి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తి ఎమోషనల్ బ్లాక్‌మెయిల్‌కి దిగడంతో మనస్తాపానికి గురైన ఆమె ఈ విధంగా ప్రాణాలు విడిచింది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. చక్రద్వారబంధానికి చెందిన ఉల్లి ఉమాదేవి (32)కి వివాహమై ఏడాది పాప కూడా ఉంది. భర్తతో కలసి కాతేరులో నివాసం ఉంటున్న క్రమంలో ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు ఒక వ్యక్తి పరిచయం కావడం, ఆపై కొన్ని రోజులకు ఎమోషనల్‌గా బ్లాక్‌మెయిల్ చేసి, మరలా ఇచ్చేస్తానని చెప్పి ఆమె నుంచి బంగారు నగలు తీసుకున్నాడు. తరువాత వాటిని ఆమెకు తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో ఇంట్లో గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో చక్రద్వారబంధంలోని పుట్టింటికి ఆమె చేరుకుంది. అయినా ఇన్‌స్టాగ్రామ్ పరిచయం వదలకపోవడంతో జీవితంపై విరక్తి చెంది, చీరతో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రత్నగిరిపై పెళ్లి బృందానికి టోకరా



సత్రం గదులు రిజర్వ్ చేసినట్లు ఫేక్ రశీదు

నకిలీ రశీదు ఇచ్చి మోసం

అన్నవరం: రత్నగిరిపై సత్రంలో గదులు రిజర్వ్ చేసినట్టు నకిలీ రశీదు ఇచ్చి రూ.8 వేలు తీసుకుని ఒక దళారీ చేసిన మోసంతో పెళ్లి బృందం తీవ్ర ఇబ్బంది పడింది. శుక్రవారం దేవస్థానం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి పెళ్లి బృందం సభ్యులు సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయానికి వచ్చి తాము హరిహరసదన్ సత్రంలో నాలుగు రూమ్‌లు రిజర్వ్ చేసుకున్నామని చెప్పి రశీదు ఇచ్చారు. నిబంధనల ప్రకారం ఒక గదికి ఒక రశీదు మాత్రమే ఉంటుంది. దాని ప్రకారం నాలుగు రూమ్‌లకు నాలుగు రశీదులు ఉండాలి. అయితే ఒకే రశీదుపై రూ.ఎనిమిది వేలకు నాలుగు రూమ్‌లు రిజర్వ్ చేసినట్లు ఉంది. అంతే కాకుండా హరిహరసదన్ సత్రం గదికి అద్దె రూ.950 చొప్పున రూ.3,800 మాత్రమే చెల్లించాల్సి ఉండగా, ఆ రశీదులో మాత్రం రూ.ఎనిమిది వేలు చెల్లించినట్లు ఉంది. రూ.వెయ్యి జీఎస్‌టీ అని కూడా ఉంది. దీంతో ఈ రశీదు నకిలీదని అర్థం అవడంతో ఆ విషయాన్ని దేవస్థానం అధికారులు ఆ పెళ్లి బృందానికి తెలిపారు. ఈ గదులు ఎవరు రిజర్వ్ చేశారని అడగగా, సుధాకర్ అనే అతను రిజర్వ్ చేసి వాట్సాప్‌లో రశీదు పంపాడని తెలిపారు. అతనికి ఫోన్ చేస్తుంటే స్విచ్ఛాఫ్ అని వస్తోందని వివరించారు. దీంతో వారికి విషయం వివరించి మిమ్మల్ని అతను మోసం చేశాడని పాత రశీదులో తేదీ, నగదు, గదుల సంఖ్య మార్ఫింగ్ చేసి రూ.ఎనిమిది వేలు వసూలు చేశారని తెలపడంతో ఆ పెళ్లి బృందం అవాక్కయ్యింది. దళారీలను నమ్మవద్దని దేవస్థానం మైకు ద్వారా ప్రచారం చేస్తున్నా కొంతమంది ఇలా మోసపోతున్నారని అధికారులు తెలిపారు. గదులు రిజర్వ్ చేసుకునే వారు నేరుగా సీఆర్వో కార్యాలయానికి వెళ్లి రిజర్వ్ చేసుకుని రశీదు పొందాలని కోరారు.

వ్యక్తిపై చాకుతో దాడి



గాయపడిన తాతీలు

కొత్తపల్లి: ఒక వ్యక్తిపై చాకుతో దాడి చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. మూలపేట ప్రకాశ్‌నగర్ కాలనీలో కొత్తగా నందీశ్వర విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మైక్ సెట్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం అదే గ్రామానికి చెందిన ఆవాల మణికంఠ సౌండ్‌ను ఒక్కసారిగా పెంచడంతో స్థానికంగా ఉన్న మేడిబోయిన తాతీలు మైక్ సౌండ్ తగ్గించమనడంతో ఇద్దరూ వాదోపవాదానికి దిగారు. మణికంఠ ఇంటికి వెళ్లి తన తండ్రి ఆవాల లోవరాజుతో వచ్చి తాతీలుతో ఘర్షణకు దిగి తన చేతిలో ఉన్న చాకుతో తాతీలను గాయపర్చాడు. అతన్ని చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. దీనిపై ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

112 కాల్‌కు స్పందించిన పోలీసులు



ఆత్మహత్యా యత్నం చేసుకున్న మహిళకు వైద్యం అందించే ఏర్పాట్లు చేసిన పోలీసులు

అమలాపురం టౌన్: స్థానిక ఎస్ఎస్ నాయుడు లేఅవుట్ ప్రాంతంలోని ఒక ఇంట్లో మహిళ ఆత్మహత్య చేసుకుంటోందని, ఓ వ్యక్తి 112కు ఫోన్ కాల్ చేసి పోలీసులకు గురువారం రాత్రి సమాచారం అందించాడు. దీంతో కాల్‌ను రిసీవ్ చేసుకున్న పట్టణ ఎస్సై కిషోర్‌బాబు, కానిస్టేబుల్ నాయుడు తక్షణమే స్పందించి క్షణాల్లో ఆ లేఅవుట్‌కు వెళ్లి ఇంట్లో తలుపులు వేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్న మహిళను నిలువరించారు. తన కుటుంబ అప్పుల సమస్యతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదిమూలం వెంకట కనక మహాలక్ష్మి (41) పురుగు మందు దాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. లేఅవుట్‌కు సకాలంలో వెళ్లిన ఎస్సై, కానిస్టేబుల్ ఆ మహిళను కాపాడారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను అత్యవసర వైద్యం నిమిత్తం ఓ ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం తప్పిందన్నారు. ఎస్సై, కానిస్టేబుల్‌ను ఆయన అభినందించారు. కనక మహాలక్ష్మి, ఆమె భర్త రాజోలు మండలం తాటిపాకలో వస్త్ర దుకాణం నిర్వహించారు. ఈ దుకాణ భాగస్వాముల మధ్య తలెత్తిన వివాదంతోపాటు పెరిగిన రుణ భారంతో ఆమె ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తెలిసింది.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో ప్రథమం



సాధించిన మెడల్స్, బహుమతులు, సర్టిఫికెట్లతో సురాద యశస్వి సత్యగంగాధర్ (కుడివైపు)

కాకినాడ రూరల్: స్థానిక కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న సురాడ యశస్వి సత్య గంగాధర్ రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్లో ప్రథమ స్థానం సాధించాడు. గుంటూరులో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ నిర్వహించిన అండర్–15 చెస్ ఓపెన్ టోర్నమెంట్‌లో మొదటి స్థానం పొంది, తమిళనాడు రాష్ట్రంలో జరిగే నేషనల్ అండర్–15 చెస్ ఓపెన్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికయ్యాడు. ఇటీవల 53వ జాతీయస్థాయి చెస్ స్పోర్ట్స్ మీట్‌లో యశస్వి సత్య గంగాధర్ విజేతగా నిలిచి బంగారు పతకం సాధించాడు. కేవీ స్కూల్ తరఫున నేషనల్‌లో వరుసగా మూడు గోల్డ్ మెడల్స్ సాధించాడు. మూడుసార్లు స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకి సెలెక్ట్ అయ్యి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరిగే అనేక చెస్ టోర్నమెంట్‌లలో బహుమతులు సాధించాడు. 2018 నుంచి 2024 వరకూ జరిగిన చెస్ పోటీల్లో సుమారు 50 మెడల్స్ పొందాడు. తన కుమారుడు గంగాధర్ గ్రాండ్ మాస్టర్ కావాలని చెస్ సాధన చేస్తున్నట్లు తల్లిదండ్రులు మహాలక్ష్మి, శ్రీనివాసరావు తెలిపారు. తండ్రి శ్రీనివాసరావు ఇంటెలిజెన్స్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు.

బొర్రంపాలెంలో చోరీ

గండేపల్లి: మండలంలోని బొర్రంపాలెంలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. బొర్రంపాలేనికి చెందిన మంగిన వీర వెంకటేశ్వరరావు ఉపాధి నిమిత్తం తన కుటుంబంతో సహా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. పెన్షన్ నిమిత్తం ఈ నెల మొదటి వారంలో బొర్రంపాలెం వచ్చి పెన్షన్ తీసుకుని హైదరాబాద్ వెళ్లిపోయాడు. గురువారం ఉదయం గ్రామంలోని తన సొంతింటి తలుపు తాళాలు పగలగొట్టి ఉండడాన్ని చుట్టుపక్కల వారు గమనించి మల్లేపల్లిలోని వెంకటేశ్వరరావు మరదలు బేరి వీరలక్ష్మికి తెలిపారు. ఆమె వచ్చి చూడగా బీరువాలోని రూ.లక్ష విలువైన బంగారం, రూ.20 వేల నగదును దొంగిలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.


గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



నిందితులను అరెస్ట్ చేసిన ఎస్సై నాగబాబు తదితరులు

గండేపల్లి: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు గండేపల్లి ఎస్సై యూవీ శివ నాగబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన కేతవత్ స్వామి నాయక్, మామిళ్లపల్లి బాలగణేష్ కలసి ఒడిశాలో ఒక వ్యక్తి వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి చిలకలూరిపేట ప్రాంతంలో ఎక్కువ ధరకు విక్రయించాలనే ఉద్దేశంతో గంజాయిని కొనుగోలు చేశారు. కొన్న గంజాయిని మోటార్ సైకిల్‌పై తరలిస్తుండగా గండేపల్లి గ్రామ శివారు హైవేపై వారిని పోలీసులు పట్టుకున్నారు. బ్యాగ్‌లో రూ.72,500 విలువైన 14.5 కిలోల గంజాయి, మోటార్ సైకిల్‌ను డిప్యూటీ తహసీల్దార్ దివ్యభారతి సమక్షంలో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

యువకుని మృతదేహం లభ్యం



కుతాని సాయి ప్రసాద్ (ఫైల్)

తాళ్లరేవు: గౌతమి గోదావరిలో బుధవారం ఓ యువకుడు గల్లంతు కాగా, అతని మృతదేహం గురువారం లభ్యమైంది. ఏడుగురు యువకులు యానాం విహార యాత్రకు వచ్చి తిరిగి వెళుతూ గోపులంక వద్ద ఫోటోల కోసం దిగగా రాజమహేంద్రవరానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి కుతాని సాయిచంద్ర గల్లంతైన విషయం తెలిసిందే. గోపులంక వద్ద గోదావరిలో గల్లంతైన యువకుడు సాయిచంద్ర ఆచూకీ కోసం తాళ్లరేవు తహసీల్దార్ పితాని త్రినాథరావు, కోరంగి ఎస్సై పి.సత్యనారాయణల ఆధ్వర్యంలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి వరకూ కొనసాగించిన గాలింపు చర్యలు, తిరిగి గురువారం ఉదయం ప్రారంభించారు. స్థానిక మత్స్యకారులతో పాటు వేదపండితుడు, వాయుబంధన దీక్ష నిపుణుడు వేలూరి వెంకట కామేశ్వరశర్మ (కాశిబాబు) యువకుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మత్స్యకారులు వలలు కట్టి గాలించారు. ఎట్టకేలకు యువకుడు పడిపోయిన ప్రాంతానికి సమీపంలోనే మృతదేహం లభ్యమైంది. ఈ ప్రాంతంలో గోదావరి చాలా లోతుగా ఉండడం వల్ల ఆచూకీ తెలియడానికి సమయం పట్టిందని స్థానిక నాయకులు బోయిడి వేణుగోపాల్, వేగేశ్న శ్రీనురాజు తెలిపారు. చేతికి అందివచ్చిన కొడుకు అర్ధాంతరంగా మృతి చెందడంతో సాయిప్రసాద్ తండ్రి, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఈ ప్రాంతంలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి అండర్–14 ఫుట్‌బాల్ బాలుర, బాలికల విభాగాల్లో ఎంపికలు జరిగాయి. దీనికి ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులకు హాజరయ్యారు. ఉప విద్యాశాఖ అధికారి ఎల్.నారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడాకారులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. హిందూపురంలో ఈ నెలాఖరున జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపికైన జట్టును శుక్రవారం ప్రకటిస్తామన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమణమూర్తి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర కిశోర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.స్వామి, ఏవీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.